# మనమిద్దరమే ఉందాం!

తెల్లారింది. ఊళ్ళో అందరికీ మామ్మూలుగానే. ఒక్కలాగే. ఆ ఇంట్లో మాత్రం అద్భుతంగా తెల్లారింది! ఆనందంగా తెల్లారింది! చీకటి వెలుగు ఆ ఇంట్లోకి సంబరంగా తొంగి చూసింది. "వచ్చావా తల్లీ! రామ్మా రా!" అని ఇంటిల్లి పాదీ ఆహ్వానించినట్టు ఇల్లంతా ఆవరించింది లేత వెలుగు.

"భళ్ళున తెల్లారింది, లేవండర్రా!" అంటూ లేచింది ఇల్లాలు కాంతమ్మ. ఆ చీకట్లోనే. ఆవిడ మొహం కలకల్లాడుతోంది. కళ్ళు సంతోషంగా మెరుస్తున్నాయి. "ఒరేయ్ చిన్నా! లేరా! ఎలా తెల్లారిపోయిందో చూడు!" అంటూ చిన్న కొడుకుని తట్టి లేపబోతే, వాడే రిగ్గున లేచాడు. "నేనెప్పుడో లేచిపోయా నోచ్!" అంటూ పక్కమంచం మీదికి గంతేశాడు.

"చిన్నక్కా! ఇంకా లేవ్వేమే? చూస్కో, నేనప్పుడే లేచిపోయా!" అంటూ చిన్నక్క చెవిలో కేక లెట్టాడు. ఆ పిల్ల రోజూలా విసుక్కోకుండా, దుప్పట్లో ముణగదీసుకోకుండా, నవ్వుతూ లేచి కూర్చుంది. ఊడిపోయిన రిబ్బన్ను ముడెట్టుకుంటూ — "ఇవ్వాళ నేను బళ్ళోకెళ్ళను" అంది.

"నేనూ వెళ్ళను, ..... అమ్మ తిడుతుందేమోనే!"

"తిడితే తిట్టింది. తిట్టుకోమను."

"ఒసే, తెల్లారిందా కబుర్లుకి? లేచి మంచాలెత్తు! రావుడూ! నువ్వు మొహం కడుక్కో! అన్నయ్య లేచాడేమో చూడూ!" అంటూ హడావుడిగా పిల్లల్ని కేకలేసి నెమ్మదిగా మొగుడి మంచం దగ్గిరికెళ్ళింది కాంతమ్మ. "ఏమిటీ, ఇంకా నిద్రే? ఇదేం చోద్యమమ్మా? భళ్ళున తెల్లారిపోతేనూ!" అంటూ సాగదీసుకుంటూ మళ్ళీ హెచ్చరించింది. "ఇదిగో మిమ్మల్నే! తెల్లగా తెల్లారిపోయింది!"

ముసుగు మనిషి ఆవలిస్తూ లేచి కూర్చున్నాడు. "అబ్బ! ఎందుకే కాకిగోలా? ఎప్పుడో లేచా, ఊరికే అల్లా పడుకున్నాగానీ."

"ఊహూ, నాదే కాకిగోల. తెల్లారిందిగా పేర్లెట్టటానికీ!" — కాంతమ్మ రానికోపం నటిస్తూ వంటింటివేపెళ్ళిపోయింది.

ఇంట్లో, పిల్లా మేకా అంతా లేచిపోయారు. ఇల్లంతా సందడి సందడిగా అయింది. అందరికీ ఆనందంగా వుంది.

భలే చుట్టాలొస్తున్నారు ఆ ఇంటికి! అత్తగారింటి దగ్గిర్నించి పెద్దకూతురూ, దాని మొగుడూనూ! "అబ్బ, ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి!" అన్న ఆతృత ఆ ఇంట్లో అందరి మొహాల్లోనూ కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

కాంతాన్నీ రామ్మూర్తినీ — తల్లిదండ్రుల్ని చేసిన అదృష్టం మొట్టమొదట పద్మకే దక్కింది. ఆనాడే పద్మ ఆ దంపతుల అన్యోన్యాన్ని చీలికలు చేసి తనో వాటా పుచ్చుకుంది. పద్మ — తండ్రి పోలికలతో, తల్లి ఛాయతో చిన్నప్పుడే చూడటానికి రెండు కళ్ళూ చాలనంత ముద్దుగా వుండేది. పద్మ తర్వాత — హరీ, శకుంతలా, రామం వాటాలకొచ్చారు. అయినా పద్మ వాటా తగ్గలేదు. తల్లిదండ్రుల హృదయ సింహాసనాల లోంచి ఆ కూతురు ఒక్క పిసరు కూడా జరగలేదు.

ఆ తల్లిదండ్రులకు, పిల్లలందరి మీదా ఒక్కలాంటి అభిమానమే వున్నా, పద్మంటే — "అది పెద్ద పిల్ల!" తర్వాత వాళ్ళకి కూడా — అక్కయ్యంటే పెద్దది!

ఆ పద్మ ఆర్నెల్లనించీ ఆ ఇంట్లో లేదు! ఒక వారం రోజులా, నెల్లాళ్ళా? ఆర్నెల్ల నించీ పద్మనెవ్వరూ చూడలేదు.

"అసలు పద్మతల్లికి పెళ్ళి చెయ్యకుండా వుండాల్సిందే కాంతం! నిక్షేపంలా దాన్ని చదివించుకుంటే మన కళ్ళెదుటే వుండేది" అని భర్త విచారించినప్పుడల్లా — కాంతమ్మ నవ్వుతూ "చదువయ్యాక మాత్రం పెళ్ళి చెయ్యద్దా?" అంటూ సాగదీస్తుంది.

ఎంత సరిపెట్టుకున్నా తల్లికి మనసు కుదుట పడదు — "అసలు ఆడపిల్లల్ని కనటమే దురదృష్టం. పెంచినన్నాళ్ళూ పెంచి ఏ అయ్యకో అప్పజెప్పేస్తాం. వాడు కష్టపెడతాడో, సుఖపెడతాడో, అంతా దాని రాత! అయితే అదృష్టం, కాకపోతే ఖర్మానూ. అబ్బ!

ఏమిటో గుండెలు పెరుక్కుని ఇచ్చేసినట్టుంటుంది. పెద్ద పిల్ల మొగ పిల్లాడే అయితే మనింట్లోనే వుండేది కదా?" అనుకుంటూ భార్య బాధపడినప్పుడల్లా భర్త నవ్వుతాడు — "నీ పిచ్చిగానీ అందరూ మొగపిల్లల్ని కంటే ఇక ప్రపంచం ఎలా నడవాలి? బాధ లేకపోతే ఆనందమేముంది? ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి నువ్వు నన్ను వెతుక్కుంటూ రాలా? అల్లాగే మన పిల్లానూ. దానికేంలోటు? దర్జాగా వుంది. ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు వొస్తూ వుంటుంది, వెళ్తూ వుంటుంది. కన్యాదానం చేసి పుణ్యం సంపాదించు కోమన్నారు పెద్దలు. ఎందుకనుకున్నావ్? ఈ విచారం మర్చిపోటానికే" అంటూ బుజ్జగిస్తున్నట్టు నచ్చచెప్తాడు.

జనార్ధన్, బంధువుల పెళ్ళిలో పద్మని చూశాడు. చూసీ చూడగానే అతనికి పద్మ నచ్చేసింది!

పెళ్ళి కబుర్లు జరిగాయి.

జనార్ధన్ ఎమ్.ఇ. పాసై లెక్చరర్‌గా చేస్తున్నాడు. మనిషి నలుపు. తల్లిదండ్రులున్నారు. ఒకే ఒక చెల్లె లుంది. వెనక ఏవేవో ఆస్థిపాస్తులున్నాయి. కుర్రాడు మంచివాడని నమ్మకంగా తెలిసింది.

రామ్మూర్తికీ, కాంతమ్మకీ మతిపోయింది. సంతో షంతో వుక్కిరి బిక్కిరయ్యారు. పద్మ మొహం మీద లక్ష్మీకళ తళతళ లాడుతున్నట్టు కన్పించింది.

పెళ్ళి కబుర్లలో కట్నాల ప్రసక్తి రాలేదు. మాకు ఇంత కావాలని రొక్కించి అడగలేదు మొగపెళ్ళి వాళ్ళు. "మీ పిల్లకి మీరేం పెట్టుకుంటారో మీ ఇష్టం! మేం అడగాలా?" అంది పెళ్ళికొడుకు తల్లి.

"మా శక్తికొద్దీ చేస్తాం వదినగారూ!" అంది కాంతమ్మ వినయంగా.

సంబంధం కుదిరిపోయింది. లగ్నం పెట్టేశారు.

రామ్మూర్తి శక్తికొద్దే కాదు, శక్తికి మించి కూడా చేశాడు.

"మన దరిద్రం ఎప్పుడూ వుండేదే. ఏదో పూర్వ జన్మ సుకృతం కొద్దీ దానికి మంచి సంబంధం వచ్చింది. దాన్నయినా సుఖపడనీ!" అనుకున్నారు తల్లిదండ్రులు.

పెళ్ళి, పెళ్ళిలాగే అయిపోయింది — సంబరంగా! అల్లుడికి మనుగుడుపులూ అయ్యాయి. రోజులు ఎలా గడిచాయో తెలీకుండా గడిచిపోయాయి. బయ ల్దేరేప్పుడు అల్లుడు తనతోపాటు పెళ్ళాన్ని తీసుకు పోతానన్నాడు.

"అప్పుడేనా? అప్పుడే కాపరానికి పంపేస్తామా? మూడో నెల్లో సారీ చీరా పెట్టి పంపుతాం" అంది అత్తగారు అల్లుడితో.

"పెట్టినవన్నీ చాల్లెండి. ఇంకా మీకు పెట్టాలని వుంటే మూడో నెల్లో అవన్నీ పట్టుకు రండి" అన్నాడు అల్లుడు నవ్వులాటలోకి దించుతూ.

కాంతమ్మ వుండబట్టలేక కూతురితో, "అప్పుడే వెళ్ళటం ఏమిటి? మూడో నెల్లో వస్తానని మీ ఆయనకి చెప్పరాదూ?" అంది.

పద్మ సిగ్గుపడిపోయిందిగానీ — మాట్లాడిందే కాదు.

పెళ్ళి అయిన పదిరోజుల్లోపటికే పద్మ మొగుడితో వెళ్ళిపోయింది.

వెళ్ళే ముందైనా అమ్మనీ, నాన్ననీ, తోడబుట్టిన వాళ్ళనీ చూసి బావురు మనలేదు. ఇరుగు పొరుగు వాళ్ళనీ, స్నేహంగా వుండే పిల్లల్నీ చూసి దిగులు పడి పోలేదు. ముసిముసి నవ్వులు నవ్వుతూ సిగ్గుపడుతూ బండెక్కి కూర్చుంది మొగుడి పక్కన.

కాంతమ్మ కూతురికేవేవో సర్దుతూనే వుంది. మూటలు కడుతూనే వుంది. బండిలోకి చేరేస్తూనే వుంది. చివరికెలాగో ఇంట్లోంచి తెములుచ్చుకుని బయటపడింది.

"అమ్మా" అని కూతురు తనని చూసి బిక్క మొహం వేస్తుందేమో ఓదార్చుదామనుకుంది — "పద్మా! అన్నీ సర్దిపెట్టుకున్నావు గదా? జాగర్తమ్మా! రైల్లో.... జాగర్త!.... వెళ్ళగానే ఉత్తరం రాయి. ఏవీ బెంగ పెట్టుకోకు" అని గబగబా చెప్పింది.

పద్మ అన్నిటికీ తలూపింది, నవ్వు మొహంతో.

బండి కదిలి వెళ్ళిపోతూంటే వెర్రిదానిలా చూచింది కాంతమ్మ. ఇంటి నిండా బిలబిల్లాడుతోన్న జనం మాట గుర్తే లేదు.

పుట్టెడు దుఃఖం వొచ్చేసింది. బావురుమని ఏడ్చెయ్యబోయింది. ఎలాగో తమాయించుకుంది. సాటివాళ్ళ హాస్యాలతో కాస్త తేరుకుంది. గంటలు గడుస్తున్న కొద్దీ మనసు బాగా తేలిక పడింది. రోజులు

గడుస్తున్నకొద్దీ మిగతా పిల్లల మంచి చెడ్డలు చూసు కోవటంలో మునిగిపోయింది.

★ ★ ★

పద్మ పెళ్ళినాటికి, హరి స్కూలు ఫైనలు పరీక్షలు రాశాడు. పద్మ వెళ్ళిపోయిం తర్వాత రిజల్ట్సు వచ్చాయి. పాసయ్యాడు. మార్కులు కూడా చాలా బాగా వచ్చాయి.

వాడి చదువు మాటేమిటని రామ్మూర్తీ కాంతమ్మా వారం రోజులు ఏకవరసగా ఆలోచించారు.

నెల్లాళ్ళ కిందట పెళ్ళికోసం అప్పు చేశారు. ఇప్పుడు మళ్ళీ కొడుకు చదువు కోసం అప్పు చెయ్యా ల్సిందేనా? ఇదంతా ఎలా తీరేట్టు?

పద్మ పెళ్ళికి అంత అప్పు అవ్వకుండా వుంటే హరి చదువు గురించి వెనకాడాల్సిన పని వుండేది కాదు.

"తెలివితక్కువ పని చేశాం కాంతం! వెనకాల సంగతి ఆలోచించకుండా ఖర్చుపెట్టాం. ఆ పిల్లా డెలాగూ మన పిల్లని చేసుకోటానికి సిద్ధపడే వున్నాడు. ఏదో పది మందికి భోజనాలెట్టి — నాలుగక్షింతలేసి అయిందనిపించెయ్యాల్సింది" అన్నాడు రామ్మూర్తి కొంచెం పశ్చాత్తాపడుతూ.

కాంతమ్మ అడ్డం వచ్చింది — "అదేం మాట? వాళ్ళు కట్నం కక్కమంటే నాలుగు వేలన్నా అయ్యేది. చచ్చినట్టు ఇచ్చేవాళ్ళం కాదా? 'మా పిల్ల అంద గత్తెమ్మా!' అని అతీగతీ లేనట్టు అంటగడితే బాగుం టుందా? ఏదో అత్త కట్నం, ఆడబిడ్డ కట్నం, మంచీ చెడ్డా అవుతాయి మరి. వాళ్ళ అందచందాలన్నీ జరిపాం కాబట్టే పిల్లని మర్యాదగా చూసుకుంటు న్నారు" అంది.

"ఇంతకీ హరి సంగతి ఏం చేద్దాం?"

"వాణ్ణి కూడా అడగరాదూ?"

తర్వాత రామ్మూర్తి కొడుకుని అడిగాడు. అడ గటం కన్నా తనే చెప్పాడు — "నువ్వు కాలేజీలో చేరినా, నాలుగైదు సంవత్సరాలు చదివేవరకూ చదువుకి అంతూ దరీ వుండదు. అప్పుడైనా దొరికేది గుమాస్తా ఉద్యోగమే. నేనే మనుకుంటున్నానంటే ..... నీక్కూడా ఇష్టపడితేనే అనుకో, లేకపోతే తల తాకట్టు పెట్టయినా నిన్ను కాలేజీలో చేర్పించేస్తాను. దానికన్నా మంచి దారేమిటంటే ప్రస్తుతానికేదైనా ట్రైనింగ్ కెళ్ళి తర్వాత ప్రయివేటుగా చదువుకోవచ్చు కదా?" అన్నాడు.

తండ్రి మొహంలో మంచితనం చూస్తూ హరి వెనకా ముందాడలేదు. "అలాగే నాన్నా!" అన్నాడు.

"కాలేజీలో చేరటం లేదని నీకేం బెంగగా వుందా?" తండ్రి ఓదార్పుగా అడిగాడు.

హరి కొంచెం సిగ్గుపడ్డ వాడిలా నవ్వి "ఊహూ! తర్వాత చదువుకోవచ్చన్నావుగా?" అన్నాడు.

రామ్మూర్తి బరువెక్కిన గుండెల్తో మాట్లాడలేక పోయాడు.

హరి, టీచరు ట్రైనింగ్‌లో చేరి నాలుగు నెల్ల యింది.

అప్పుచేసి పద్మకి పెళ్ళి చేసినందుకు తర్వాత రామ్మూర్తి ఎప్పుడూ విచారించలేదు.

పద్మ ఆషాడ మాసంలో కూడా రాలేదు. జనార్ధన్ ఆషాడ మాసం అంతా సెలవుపెట్టి పెళ్ళాన్ని తీసుకుని ఊళ్ళ మీదికి బయల్దేరేడు. చూడాలనుకున్న ఊళ్ళన్నీ తిరిగ్గా చూసి, నాలుగైదు రోజులు మిగిలి వుంటే ఓ స్నేహితుడింట్లో గడిపేశాడు.

పద్మని చూడాలని కాంతమ్మ కలవరించడం మొదలుపెట్టింది. రామ్మూర్తి, అల్లుడి పేరా, వియ్యం కుడి పేరా, నాలుగైదు గొలుసు ఉత్తరాలు రాశాడు — వారం రోజుల్లో.

రెండు వారాలకి తీరిగ్గా ఓ కార్డు ముక్క వచ్చింది వియ్యాల వారి దగ్గర్నించి — మీ అల్లుడూ కూతురూ ఫలానా రోజు వస్తున్నారని!

ఇంట్లో వాళ్ళ సంతోషానికి అంతు లేదు.

"పద్మ తల్లి వస్తోంది. ఎలా వుందో! చూసి చాన్నా ళ్ళయింది" అనుకున్నాడు తండ్రి.

"పెద్ద పిల్ల వస్తోంది. బెంగ పెట్టుకుని చిక్కి పోయిందేమో" అనుకుంది తల్లి.

"అక్కయ్య వస్తోంది. మా అక్కయ్య వస్తోంది" అని సంబరపడిపోతూ తెలిసిన వాళ్ళందరికీ చెప్పి వచ్చారు చిన్నవాళ్ళు.

నిజంగా పద్మతోపాటు వాళ్ళాయన కూడా

రావటం ఆ ఇంట్లో ఎవరికీ అంత ఇష్టం లేదు. అతగాడొచ్చాడంటే పెళ్ళాన్ని రెండు రోజులో మూడు రోజులో వుంచి తీసుకుపోతాడు. ఆ వున్న నాలుగు పూటలూ ఇద్దరూ గదిలో దూరి కూర్చుంటారు. సిగరెట్టు దగ్గిర్నుంచీ అన్నీ అందిస్తూ గంటల తరబడీ అక్కడే కూర్చుంటుందిగానీ బయటికి వూడిపడదు. పెళ్ళిలో అతను వున్న వారం రోజులూ పద్మ మొహం చూద్దామంటే కనిపించేదే కాదు.

ఇప్పుడలా చెయ్యదులే. ఆర్నెల్ల తర్వాత పుట్టింటి మొహం చూస్తోంది. దానికి మాత్రం అందరితోటీ మాట్లాడాలని వుండదా?

★ ★ ★

పద్మ వచ్చే ఆ ఫలానా రోజు .... భళ్ళున తెల్లారింది! ఆ ఇంట్లో అందరికీ మహాదానందంగా తెల్లారింది.

కాంతమ్మ పద్మ కిష్టమైన కంది పచ్చడీ గుమ్మడికాయ పులుసూ చేసింది. పరమాన్నం వండింది. ఇల్లూ వాకిలీ తీర్చిదిద్ది వుంచింది.

హరి స్టేషన్ కెళ్తోంటే, శకుంతలా రామూ కూడా బడి ఎగ్గొట్టి అన్నయ్య వెంట వెళ్ళారు.

జనార్ధన్ లేకుండా పద్మ ఒక్కతే వచ్చింది.

"బావగారేరీ?" అన్నాడు హరి ఎగాదిగా చూస్తూ.

"రాలేదు. సెలవు దొరకలేదు" అంది పద్మ. చిన్నవాళ్ళని చూచి నవ్వింది. గబగబా బేగ్‌లోంచి ఏవో తీసి ఇచ్చింది తినటానికి.

అంతా ఇంటి కొచ్చారు.

పద్మని చూస్తూంటే నోట్లోంచి మాట రాలేదు కాంతమ్మకి.

"బావ రాలేదమ్మా! సెలవు దొరకలేదంట" అన్నాడు హరి.

కాంతమ్మ మనసు పొంగిపోయింది — అల్లుడు రానందుకు — "అదేమిటే? ఇద్దరూ వస్తున్నారని రాశారే!" అంది పైకి.

పద్మ మొహం ముడుచుకుంది — "సెలవు దొరకలేదు. నేనూ మానేద్దామనుకున్నాను" అంది.

తల్లి తెల్లబోయింది. "మానేద్దామనుకున్నావా? మంచి దానివే. ఇంకోసారి అతనే వస్తాడు. పద లోపలికి. శకుంతలా! పొయ్యి మీద కాఫీ వుంది. తెచ్చి అక్కయ్యకియ్యి" అంటూ పురమాయించి పద్మ పెట్టి లోపలికి తీసుకు వచ్చింది.

పద్మ కొంచెం ఒళ్ళు చేసింది. ఛాయ కూడా ఇంకా పచ్చబారింది. చెవులకి దుద్దులు తీసేసి రింగులు పెట్టుకుంది. జడకి రిబ్బన్ను లేదు. ఏదో కొత్త రకం సిల్కుచీర కట్టుకుంది. కుడి చేతికి తాళం కప్పంత వాచీ వుంది. మనిషి పద్మలా కాదు, ఎవరోలా వుంది.

పద్మ కాఫీ తాగి, స్నానం చేస్తానంది.

గబగబా వేన్నీళ్ళు తోడి పెట్టింది కాంతమ్మ.

పద్మ స్నానానికి వెళ్ళి "అమ్మా! నా పెట్లో కొత్త సబ్బుంటుంది చూడు, శకుంతల్నిలా తెమ్మను!" అంటూ కేకలు పెట్టింది.

"అక్కడ గూట్లో ఎర్ర సబ్బుందమ్మా, సరిగ్గా చూడు."

"ఛీ! ఇది నాకొద్దు! గజ్జి కంపు ఇది .... నా పెట్లో...."

"తాళం వేసి వుందే పెట్టికి. పోనీ సున్నిపిండివ్వనా?"

"ఉహూ! తాళం చెయ్యి బ్యాగ్‌లో వుంది. చెప్పటం మర్చిపోయా."

కాంతమ్మ చేతిలో పని వొదిలేసి బేగ్‌లో సామానులన్నీ గుమ్మరించి తాళం చెయ్యి వెతికీ పెట్టెతీసి సబ్బుబిళ్ళ పట్టుకునే సరికి పది నిమిషాలు దాటింది.

పావు గంటకి స్నానం చేసి బయట కొస్తూ పద్మ సబ్బు పెట్టి తెచ్చి బేగ్‌లో పెట్టుకుంది. పెట్లోంచి తల నూనె తీసి తలకి రాసుకుంది. అద్దం, దువ్వెనా తీసి తల దువ్వుకుంది. సెంటు సీసా తీసేసరికి — "అక్కయ్యా! నాకు .... నాకు...." అంటూ ఎగబడ్డారు చిన్నవాళ్ళు. తను బట్టలనిండా అన్ని చోట్లా రాసుకుని, వాళ్ళకా వేలు అంటించింది. మళ్ళీ అన్నీ పెట్లో సర్దేసుకుంది.

పద్మ అత్తారింటికి వెళ్ళేటప్పుడు స్నోలూ పౌడర్లూ సెంట్లూ — అన్నీ పట్టుకెళ్ళింది. ఇవన్నీ కొత్త వాటిలా కనపడుతోంటే తల్లి అడిగింది. "నువ్వు తీసికెళ్ళినవన్నీ అయిపోయాయటే?" అని.

పద్మ అన్నీ పొందిగ్గా పెట్లో సర్దుకుని తాళం వేస్తూ

— "అవెన్నాళ్ళు వస్తాయ్?" అంది.

"సరేగానీ లేచి రా! ఒక ముద్ద తిని .... కాస్సేపు పడుకో, మళ్ళీ జానకీ వాళ్ళు వస్తారేమో! నిన్ను చూడాలని తెగ కొట్టుకుంటున్నారు" అంది తల్లి.

నలుగురి పిల్లలకీ ఒక్కసారే అన్నాలు పెట్టేసింది. పద్మ కంది పచ్చడితో ఒక ముద్ద తిని తీసేసింది. మిగిలిన కూరలు కూడా సరిగ్గా తినలేదు.

"అదేవిటే?" అని తల్లి లబలబలాడింది. "మన తిండీ మన కూరలూ అన్నీ మర్చిపోయావటే?" అంది దిగాలుపడి.

"అబ్బ! అన్నిట్లోనూ ఉప్పెక్కువై పోయిందమ్మా!" అంది పద్మ చెయ్యి కడుక్కుంటూ.

కాంతమ్మ కూడా రెండు మెతుకులు పెట్టుకుంది. "పద్మా! మీ అత్తారి కబుర్లేవిటే? ఏవీ చెప్పావు కావు" అన్నం తింటూ ఆప్యాయంగా అడిగింది కూతుర్ని.

"ఏవున్నాయ్? అంతా బాగానే వున్నారు. అబ్బ! నిద్రొస్తోంది. కాస్సేపు పడుకుంటానమ్మా!" అంటూ లేచి గదిలోకి వెళ్ళిపోయింది కూతురు.

★ ★ ★

"పద్మా! కాఫీ తాగవా? మూడై పోయిందీ" అంటూ తల్లి అరగంటనించీ పాట పాడుతోంటె నెమ్మదిగా కళ్ళు విప్పింది పద్మ.

"మధ్యాన్నం కాఫీ ఏవిటమ్మా! టీ తాగుతాం మా ఇంట్లో" అంది బద్ధకంగా ముడుచుకుని పడుకుంటూ.

కాంతమ్మ కొంచెం తెల్లపోయింది. దిగాలుపడి చూసింది. 'మా ఇంట్లో'నా?

"మీ ఇంట్లో తాగితే సరేలే. మనింట్లో టీ పొడుం లేదు కదమ్మా! పిల్లలు బళ్ళోకి పోయారు. ఇంకా రాలేదు."

"తర్వాత తాగుతాలే! టీ అలవాటై పోయిందమ్మా! లేకపోతే తల నెప్పొస్తుంది" అంది పద్మ కళ్ళు మూసుకునే.

కాంతమ్మ పక్కింటి వాళ్ళ పిల్లాణ్ణి పిల్చి టీ పొట్లం తెప్పించి టీ కాచింది.

అప్పటికి లేచి పద్మ మొహం కడుక్కుని మళ్ళీ జడ వేసుకుంది.

టీ ఒక్కసారి చప్పరించి మొహం చిట్లిస్తూ 'ఇదేంటమ్మా! అంతా పొగకంపు" అని వదిలేసింది.

కాంతమ్మ కెందుకో అనుమానం వచ్చింది. కూతుర్ని ఎగాదిగా చూసింది. ఎలా అడగాలో సిగ్గేసింది. మొహం మీద నవ్వు తొణికిసలాడింది. అనునయంగా అడిగింది "పద్మా! నీ ఒంట్లో బాగోలేదా ఏమిటే?"

పద్మ తలగడలోకి మొహం పెట్టేసుకుంది — "ఊహూ, నాకేం? బాగానే వుంది."

"చెప్పూ! నా దగ్గిర సిగ్గెందుకూ? నెలగాని తప్పిందా? నిన్ను చూస్తోంటే అల్లాగే వుంది."

పద్మ మాట్లాడలేదు. సిగ్గుపడిపోయిన దానిలా నవ్వింది.

కాంతమ్మ కడుపు వెన్నెల సముద్రం అయిపోయింది. బిడ్డమీద పుట్టెడు అభిమానం ముంచుకొచ్చింది — "నీ కడుపు బంగారంగానూ? ఇంతసేపూ ఆ కబురే చెప్పలేదే? ఎన్నో నెలా?"

"ఏమో! నాకు తెలీదు బాబూ!"

కాంతమ్మ నవ్వింది — తర్వాత అదే చెప్తుందని అక్కణ్ణించి లేచి పోయింది. ఎర్ర సబ్బు వాసన నచ్చకపోటానికీ, కంది పచ్చడి తినకపోటానికీ కారణం తెలిసిపోయాక, కాంతమ్మ మనస్సు తేలిక పడింది. సంతోషంతో నిండిపోయింది.

పిల్లకి నెల తప్పిందా? ఎంత....! కన్నుమూసి తెరిచేలోగా నెలలు నిండుకొస్తాయి. మనవడో, మనవరాలో! — కాంతమ్మకి హఠాత్తుగా పదేళ్ళ వృద్ధాప్యం .... గాంభీర్యం మీద పడ్డాయి.

తల్చుకుని తల్చుకుని తనలో తనే పుక్కిలింతలుగా నవ్వుకుంది. వంటింట్లో ఇటూ అటూ తిరిగింది. మళ్ళీ కూతురు దగ్గిరి కొచ్చింది, ఏదో నెపంమీద "ఎన్నో నెలంటే చెప్పావే కావేమే? రెండు నెలలు వెళ్ళాయా?"

పద్మ సిగ్గుపడుతూనే "ఊఁ" అని ఊఁ కొట్టింది.

"మీ అత్తగారైనా ఒక కార్డు ముక్క రాయకపోయిందా మాకు?" యధాలాపంగా అంది కాంతమ్మ.

"రాస్తా నన్నారు మరి" అని వూరుకుంది పద్మ.

బయటినించి జానకి కంఠం జానకి కన్నా ముందొచ్చింది.

"అత్తయ్యా, పద్మ వచ్చిందట కదా? శకుంతల కనపడితే అడిగాను" అంటూ వచ్చింది జానకి. వస్తూనే పద్మని చూసింది. "అబ్బో, బస్తీ పిల్లయి పోయిందండోయ్!" అంటూ వేళాకోళం చేసింది.

కాంతమ్మ వంటింట్లోకి వెళ్ళి పనుల్లో పడింది.

పద్మ జానకితో తెగ మాట్లాడుతోంది. గంట కొట్టినట్టు విన్పిస్తున్నాయి మాటలు వంటపాకలోకి. మొగుణ్ణి గురించి చెప్తోంది. అత్తగార్ని గురించి చెప్తోంది. వాళ్ళ ఇంటి గురించి వర్ణిస్తోంది.

కాంతమ్మ ఎసరుపెట్టి, కూరలు కోసి మళ్ళీ పద్మా వాళ్ళ దగ్గరికెళ్ళింది. "పద్మా! సాయంత్రం అన్నంలోకి పెసరట్టు తింటావటే? అప్పుడే వేడిగా వేసి పెడతానూ" అంది.

"ఒద్దులేమ్మా? ఇప్పుడెందుకూ?"

"ఏం? నీకు సయించదా? మీ అత్తగారేం వంటలు వండి పెట్టేదోగానీ, ఇక్కడి తిళ్ళన్నీ మర్చిపోయి నట్టున్నావు."

జానకి నవ్వుతూ "వాళ్ళత్త గారు చాలా మంచిదట అత్తయ్యా!" అంది.

"ఏమోనమ్మా! నేనడిగితే వాళ్ళ కబుర్లేవీ చెప్పింది కాదు. అన్నట్టు పద్మా, మీ ఇంట్లో వంటెవరు చేస్తారే?" అని వంటపాకలోకి వెళ్ళబోతున్నదల్లా వెనక్కి తిరిగి కుతూహలంగా అడిగింది కాంతమ్మ.

పద్మ తలగడమీద వేళ్ళతో గీతలు గీస్తూ చెప్పింది "మా అత్తయ్యగారే చేస్తారు. నన్నే పని ముట్టుకోనివ్వరు. ఇంట్లో ఎప్పుడూ ఓ పని కుర్రాడుంటాడు. పని మనిషి ఎలాగూ వస్తుంది. పన్నెండు రూపాయలిస్తాం దానికి. బట్టలవీ అదే ఉతుకుతుంది. నన్ను తలకూడా రుద్దుకోనివ్వదు. పని మనిషే రుద్దుతుంది."

"అదేవిటే? మరి నువ్వేం చేస్తావు?" అంది తల్లి తెల్లబోతూ.

పద్మ నవ్వేసి వూరుకుంది.

"వంటంతా ఆవిడ చెయ్యడం ఏవిటి? నువ్వా నేర్చుకో వద్దూ?" అంది మందలింపుగా.

కూతురు అంత సుఖపడుతోందంటే చాలా సంతోషంగానే వుంది కాంతమ్మకి. అయినా ఎందుకో కడుపంతా కలచినట్టయింది. పిచ్చిగానీ, పద్మకింకా ఈ పుట్టిల్లూ, ఈ పేదవాళ్ళ పాట్లూ, ఇంకా ఎక్కడ గుర్తున్నాయి?

పద్మ పెట్టె తీసి జానక్కి కొత్తగా కొనుక్కున్న చీరలు చూపించింది. తనూ మొగుడూ తీయించుకున్న ఫొటోలు చూపించింది.

కాంతమ్మ వుండబట్టలేక తను కూడా ఫొటోలవీ ఎగబడి చూసింది. సంతోషించింది.

సాయంత్రం రామ్మూర్తి శ్రమంతా మర్చిపోయి ఉత్సాహంగా వచ్చాడు. కూతుర్ని చూశాడు. కన్నుల పండుగ అయింది తండ్రికి. "బాగున్నావా అమ్మా" అన్నాడు పొంగిపొర్లే అనురాగంతో.

పద్మ కొంచెం నవ్వి తలదించుకుని సిగ్గుపడుతూ తలూపింది.

"మీ ఆయన కూడా వస్తానన్నాడే!"

"రాలేదు. సెలవు దొరకలేదు."

"పోనీలే. ఏం చేస్తాం మరి? మీ అత్తగారూ వాళ్ళూ బాగున్నారా?"

కుశల ప్రశ్నలన్నీ అయ్యాయి.

"అసలు కబురు తెలిస్తే ఇంకెంత మురుస్తారో మీరు" అంటూ కాఫీ అందించింది కాంతమ్మ.

పద్మ లోపలికి తప్పుకుంది.

"కబురేమిటి?"

"ఇంకేమిటి? మీ నెత్తెక్కి చెవులు మెలెయ్యటానికో కుర్ర సన్యాసి పుడతాడు లెండి."

"ఆహా! నిజమే! ఎన్నో నెలా? ఒంట్లో కులాసాగా వుందా?"

ఇద్దరూ బాగా పెద్ద వాళ్ళయిపోయి, పుట్టబోయే కుర్ర వెధవని మధ్యన పెట్టుకుని వేళాకోళా లాడుకున్నారు.

"నా చెవులెందుకు మెలేస్తాడూ? నీ కొప్పట్టుకు లాగుతాడుగానీ" అన్నాడు రామ్మూర్తి.

"ఆఁ, అదీ చూద్దాం. ఇంకెన్నాళ్ళూ? నాలుగు నెలలు కళ్ళు మూసుకుంటే సరి. ఏడో నెల జొరబడగానే పురిటికి తీసుకు రావాలి. తల్చుకుంటేనే నా కాళ్ళు వణుకుతున్నాయి. ఈ గండం ఎలా గడిచి గట్టెక్కుతుందో! చేతికి సాయంగా కామాక్షి వదిన్ని రమ్మని వుత్తరం రాయాలి."

రామ్మూర్తి నవ్వాడు. "ఏమిటలా గాభరా

పడిపోతున్నావ్? ఇంకా ఏడు నెల్ల మాట కదా?"

"ఆఁ, ఎంతలో వస్తాయి? దొర్లుకుంటూ వస్తాయి. రేపు వదినకో ఉత్తరం రాసి పడేద్దురూ! పద్మకి నెల తప్పిందనీ .... పురుడు ఆవిడ చేతులమీదే పొయ్యాలనీ నేను రాసినట్టు రాయండి".

"రాస్తాలే. బజారుకెళ్తాను, ఏమైనా తేవాలా?"

"ఏం తెస్తారు? ఏం చెప్పినా దొరకవంటారు. ఇంకేం చెప్పనూ? అన్నట్టు టీ పొట్లం ఒకటి కావాలి, పద్మకి అలవాటైందట. శెనగపప్పు తెస్తారా?"

"ఎక్కడ ఎత్తుకు రానూ?"

"అయితే అయింది. బ్లాకులోనే కొనితెద్దురూ! పద్మకి బొబ్బట్లంటే ప్రాణం. తెగ తింటుంది."

రామ్మూర్తి వెళ్ళిపోయాడు.

శకుంతలా, రామూ బళ్ళోంచి వచ్చేశారు.

"అక్కయ్య దగ్గిర ఫొటోలున్నాయి, చూడండ్రా" అంది కాంతమ్మ వంటింట్లోకెళ్తూ.

"ఫొటోలా? చూపించక్కయ్యా!" అంటూ పద్మ మీద పడ్డారు పిల్లలు.

"అన్నీ సర్ది పెట్టేశాను. ఇప్పుడు కాదు. రేపు చూపిస్తాలెండి" అంది పద్మ బద్ధకంగా.

చిన్న వాళ్ళిద్దరూ చిన్నబోయారు.

"పోనీ రేపు చూపిస్తుంది లెండి. ఇలా రండి. పెసరట్టు ముక్కలు పెడతాను" అంటూ వాళ్ళని పిల్చింది కాంతమ్మ.

★ ★ ★

పద్మ వచ్చి వారం రోజులైంది.

కూతురు ధోరణి బాగా ఆకళింపై పోయింది తల్లికి.

మొదట్లో "ఏమోలే" అని సరిపెట్టేసుకుంది గానీ రానురానూ సర్దిచెప్పుకోలేక పోయింది.

చిన్నవాళ్ళిద్దరూ ఫోటోలు చూపించమని ఎంత అడిగినా "మీరేం చూస్తారు? చేతులు పెట్టి పాడు చేస్తారు" అంది ఒకసారి. "తర్వాత చూపిస్తాలెండి" అంది ఇంకోసారి. రెండు రోజులదాకా ఆ మాటే లేదు.

పద్మ స్నానం చేస్తోంటే శకుంతల పెట్టి తీసి ఫొటోలు బయటికి తీసేసింది. 'నేను ముందు చూస్తానంటే నేను ముంద'ని చిన్న వాళ్ళిద్దరూ దెబ్బలాడుకోవటంతో రహస్యం కాస్తా బయటి పడిపోయింది.

పద్మ బట్టలు చుట్టపెట్టుకుని గబగబా వచ్చి కోపంగా "ఎవరు చెప్పారే నీకు నా పెట్టి తియ్యమనీ? వెధవ్వేషం! పళ్ళు రాలగొడతాను" అంటూ చెల్లెల్ని లెంపకాయ కొట్టినంత పని చేసి ఫొటోలు వూళ్ళాక్కుంది.

శకుంతల బిక్కమొహం వేసి వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది.

కాంతమ్మ గబగబా వచ్చింది "ఏదో సరదాకొద్దీ తీసింది. దాన్నెందుకే అలా కేకలేశావు పద్మా?" అంది నిష్ఠూరంగా.

"లేకపోతే చూడమ్మా! పెట్టంతా ఎలా కెలికేసిందో! ఫొటోలవీ మచ్చలు పడితే ఆయన విసుక్కుంటారు."

"అయితే అవేవో మీ ఇంటిదగ్గిరే పెట్టుకుని రాలేక పోయావా? ఇక్కడి కెందుకు తెచ్చావూ?" అని తర్వాత చిన్న కూతుర్ని కేకలేసింది — "అయినా దాని పెట్టి ముట్టుకోటం నీకేంపొయ్యే కాలమే? కొత్త బట్టలవీ అద్దంలా సర్దుకుంది. ఇంకా ఏమిటేమిటో వుంటాయి. అవన్నీ పాడుచేస్తే దానికి చిరాకు రాదూ? చాలుగానీ ఫో అవతలకి" అంది.

శకుంతల బిక్కచచ్చి వెళ్ళిపోయింది.

పద్మ తనొచ్చిన మర్నాడే పొద్దున్నంతా కూర్చుని ఏమిటో ఓ గంటసేపు రాసింది.

చద్దన్నం తినటానికి పీటమీద కూర్చున్న తమ్ముణ్ణి పిల్చింది. "ఒరే రామూ! ఈ ఉత్తరం కొంచెం పోస్టులో వేసి వచ్చేద్దూ!" అంది.

"అన్నం తింటున్నా నక్కయ్యా!"

"తర్వాత తిందువుగానిలే."

"అన్నం తినేసి బళ్ళో కెళ్ళాలిగా? అప్పుడు తీసుకుపోయి డబ్బాలో పడేస్తాను."

"ఆలస్యం అయితే పోస్టు వెళ్ళి పోతుందేమో! ఫర్వాలేదు. ఒక్కసారెళ్ళి వచ్చేద్దూ! పది పైసలిస్తాను. ఏదన్నా కొనుక్కుందువుగాని."

రామం పీటమీదనించి లేచి అయిష్టంగానే ఉత్తరం పట్టుకుని వెళ్ళిపోయాడు.

కాంతమ్మ వూరుకోలేక పోయింది "పాపం వాడు అన్నానికి పీటమీద కూడా కూర్చున్నాడే! పోస్టు

వెళ్ళిపోతే మాత్రం అంత అర్జంటేమిటి? పోస్టులో రేపు వెళ్ళదూ?" అంది కొంచెం కోపంగా.

పద్మ జవాబు చెప్పలేదు.

రామం తిరిగివచ్చి అన్నం తింటోంటే పద్మ పది పైసలు తెచ్చి ఇవ్వబోయింది.

కాంతమ్మకి కళ్ళనిండా కోపం వచ్చేసింది. "ఏమిటే ఆ పనీ? ఉత్తరం పట్టుకెళ్ళాడని డబ్బులిస్తావా? మంచిదానివే. ఎవరైనా వింటే నవ్విపోతారు."

"అది కాదమ్మా! ఇస్తానని ఆశపెట్టానే! ఏదన్నా కొనుక్కుంటాడు."

"ఆశా లేదు, సింగినాదం లేదు. వాడిక్కావాలంటే నేనిస్తాను."

పద్మ గదిలోకెళ్ళి పదిపైసలూ పర్స్‌లో పడేసుకుంది.

పద్మ వచ్చినప్పట్నించీ దాని గోళ్ళకున్న ఎర్ర రంగు వింతగా చూస్తోనే వుంది శకుంతల. "అక్కయ్యా! ఇదెలా వేసుకున్నావే?" అంది చాలా సార్లు.

"మీ బావ వేశారు. నేవేసుకోలా" అని జవాబు చెప్పింది పద్మ గర్వంగా. పద్మ తల దువ్వుకుంటోంటే — దాని తోలు బొట్టు పెట్టెలో గోళ్ళరంగు సీసా చూసేసింది శకుంతల.

"అక్కయ్యా! ఇదేమిటే?" అంది సంబరంగా దాన్ని పైకితీస్తూ.

పద్మ దాన్ని వూళ్ళాక్కుని లోపల పెడుతూ "చిన్న పిల్లకెందుకే గోళ్ళరంగూ?... అయినా నాకు వెయ్యటం రాదు" అని పెట్టి మూత పెట్టేసింది.

శకుంతల తల్లి దగ్గర కెళ్ళి "అమ్మా! అక్కయ్య పెట్లో గోళ్ళ రంగుసీసా వుంది" అంది ఆశగా.

"ఏం? నీకు వేస్తానందా?"

"ఉహూ! వెయ్యనంది."

కాంతమ్మ — కూతుర్ని దగ్గిరికి తీసుకుంది — "పోనీలేమ్మా! నీకో సీసా తెమ్మని అన్నయ్యకి చెప్తాలే! తప్పకుండా తెమ్మని చెప్తాను. నువ్వేం బాధపడకేం? వెళ్ళు, ఆడుకో. కొంచెం బఠానీలు తీసుకు వెళ్ళిపో" అంటూ గోళ్ళరంగు మాట మరిపించబోయింది.

శకుంతల వెళ్ళినట్టే వెళ్ళి కాస్సేపటికి మళ్ళీ వచ్చింది. తల్లి మొహంమీద చేతులాడిస్తూ నవ్వింది. "తిలకం రాసుకున్నానమ్మా! భలే బాగున్నాయి కదూ నా గోళ్ళు?"

కాంతమ్మ ఒక్క క్షణం వాటికేసి చూసి చటుక్కున ఆ చేతులు ముద్దు పెట్టుకుంది — "ఎంత బాగున్నాయో పిచ్చిముండ చేతులు. నీక్కూడా మొగుడొస్తే సరి. వాడే తెస్తాడు గోళ్ళ రంగులూ .... వేళ్ళ రంగులూనూ"

శకుంతల సిగ్గుపడిపోయి అక్కణ్ణించి పరిగెత్తింది.

★ ★ ★

అన్నానికి రాకుండా అరగంట నుంచీ లెక్కలతో తన్నుకుంటోంది శకుంతల — "వెధవలెక్క .... రావటం లేదు" అని బిక్క మొహం వేసింది.

"శకుంతలా! అన్నం పెట్టేశానే!" అని తల్లి అరుస్తోనే వుంది.

శకుంతల వినిపించుకోకుండా పుస్తకం పట్టుకుని అక్క దగ్గిరికి వెళ్ళింది — "అక్కయ్యా! కొంచెం ఈ లెక్క చెప్పవే! నాకు చేతకావటం లేదు" అంది.

పద్మ రాస్తోన్న ఉత్తరం మూసేసి — "నాకిప్పుడు ఖాళీ లేదు. ఉత్తరం రాసుకుంటున్నాను. తర్వాత చెప్తాలే" అంది చిరాకు పడుతూ.

"కాదక్కయ్యా! ఇప్పుడు చేసి తీసికెళ్ళాలి. లేకపోతే మేష్టారు కొడతారు."

"అబ్బబ్బ! పోదూ! రోజూ ఎలా చేసుకుంటున్నావు? తొందరగా బళ్ళోకెళ్ళిపో! కమలా వాళ్ళెవరైనా చేసు కొచ్చారేమో, ఎక్కించుకో."

తల్లి శకుంతలని పిలుస్తూ వచ్చింది — "తిండి తినమంటే వూడిపడవేమే?" అంటూ వచ్చిన తల్లి చిన్న కూతురి అవస్థంతా చూసింది. "అదేం లెక్కే తల్లీ నీ ప్రాణానికి? ఇలా రా! కూడికలేనా? నాకొస్తుందేమో చూస్తానిలా రా."

"కూడికలు కావమ్మా! వడ్డీ లెక్క. ఒక ఉద్యోగస్తుడు 1600 రూపాయలు, అప్పు తెచ్చి ఇల్లు కట్టించెను. నెలకు నూటికి రూపాయిన్నర చొప్పున 15 సంవత్సరములకు ఎంత వడ్డీ అగును?" అని చదివి ఏడుపు మొహం పెట్టింది శకుంతల.

"సరి. మన బతుకుల్లాగే వుంది వాడి బతుకూనూ. అంత అప్పు తెచ్చి ఇల్లు కట్టుకోకపోతేనేం....? నెలకు

నూటికి రూపాయిన్నరా? పదహారు వందలకా?.... పదహారూ ... ఎనిమిదీ .... ఇరవై నాలుగు రూపాయలు. సంవత్సరానికి .... 15 సంవత్సరాలకా?....." తల ఇటూ అటూ ఆడించి "360 రూపాయలని రాసుకోవే" అని చెప్పేసింది కాంతమ్మ విజయ గర్వంతో.

"ఊహూ! అలా కాదమ్మా! లెక్కంతా ఎలా చేశామో వర్కింగుతో రాసి చూపించాలి" అని బిక్క మొహం పెట్టింది శకుంతల.

"ఎలా ఏవిటి? నోట్లో చేసుకుంటాం. ముందు నువ్వు లేచిరా అన్నానికి .... పోనీ పద్మా! ఒకసారి దానికా లెక్క చెప్పరాదటే? నిన్నేగా ఉత్తరం రాసిందీ? మళ్ళీ ఏవిటి రాస్తున్నావు? తర్వాత రాసుకో రాదూ?"

పద్మ పెన్నుతో అరిచేతిలో బొట్లు పెట్టుకుంటూ నసుగుతూ అంది — "వెళ్ళగానే మా అత్తగారు ఉత్తరం రాయమన్నారు. నిన్న రాసింది ఆవిడక్కాదు."

"సరి, అప్పుడు భర్త గారికీ, ఇప్పుడు అత్త గారికీనా? బాగుందమ్మా! నువ్వు అత్తారింటి కెళ్తోంటే, వెళ్ళగానే ఉత్తరం రాయమని నేను మాత్రం చెప్ప లేదూ? రాశావా? ఎప్పుడో రెన్నెల్లకో కార్డు ముక్క! హరి స్కూలు ఫైనలు పరీక్ష పేసయ్యానని రాస్తే జవాబన్నా ఇచ్చావా? నువ్వుత్తరం రాస్తావని ఎన్నాళ్ళెదురు చూశాడూ?" అని నాలుగూ అనేద్దామా అనిపించింది. అనలేకపోయింది.

తన పెద్దతనం చిన్నబోవటం ఇష్టంలేక శకుంత లకి అన్నం పెట్టే నెపం మీద అక్కడినించి గిర్రున తిరిగి వెళ్ళిపోయింది కాంతమ్మ.

★ ★ ★

పద్మ వున్న వారం రోజులూ నిప్పుల మీద నించుంది. ముళ్ళ మీద కూర్చుంది. ఒక మాటా మంచీ లేదు. కష్టం సుఖం లేదు. ఫక్కుమని నవ్విన పాపాన పోలేదు. ఆర్నెల్ల తర్వాత ఆడపిల్ల ఇంటికి వచ్చిందన్న సందడే లేదు. అసలు ఇంట్లో కళే లేదు. కాంతమ్మ మనసు పరిపరివిధాల పోయింది. నోరు తెరిచి మొగుడితో కూడా ఒక్క ముక్క అనలేదు.

ఆవాళ, పద్మ, ఒంట్లో బాగా లేదని లేవలేదు. కాఫీ తాగ లేదు. కాంతమ్మ గాభరా పడిపోయింది "అమ్మా పద్మా! ఎలా వుందే నీకూ?" అని మంచం దగ్గిరికెళ్ళి మెత్తగా అడిగింది.

"కొంచెం తల నొప్పిగా వుందమ్మా! అంతే."

"పోన్లే, ఒకసారి డాక్టరుగారి దగ్గిరికెళ్దామా? నాన్న జాగర్తగా తీసికెళ్తారు."

రామ్మూర్తి కూడా సిద్ధపడ్డాడు, ఆఫీసుకి సెలవు పెట్టి ఆస్పత్రి కెళ్ళటానికి.

పద్మ ఒప్పుకోలేదు. "ఊహూ! ఇక్కడ మందులేవీ పుచ్చుకోవద్దని ఆయన చెప్పారు. అక్కడ మాకు తెలి సిన లేడీ డాక్టర్ దగ్గిర మందులు వాడుతున్నాను. వికారప్పెడితే వేసుకోమని మాత్రలిచ్చింది. అవి అయిపోయాయి. ఫర్వాలేదులే, అక్కడి కెళ్ళిపోయాక మళ్ళీ వాడతాను."

"అదేవిటే? వారం అన్నా అవలేదు. నువ్వసలు వొచ్చినట్టే లేదు. పోనీ ఆ మాత్రలేవో ఈ వూళ్ళో డాక్టరు రాసివ్వడూ?"

"అయినా వారం రోజుల్లో వొచ్చెయ్యమని ఆయన చెప్పారు."

కాంతమ్మ కేమనాలో తోచలేదు — "సరేలే! ఇంకో నాలుగు రోజులు పోనీ వెళ్దుగాని, ఎలాగా ఏడో నెల్లో తీసుకు రావాలి. పోనీ ఈ నాలుగు నెలలూ అక్కడే వుండు, నీ మనసూ బాగా లేదు" అంది ఓదార్పుగా.

పద్మ తటపటాయిస్తూ నవ్వు మొహంతో "ఏడో నెల్లో వాళ్ళు పంపిస్తారో లేదో!" అని నసిగింది.

"ఎవర్నీ? నిన్నా? పంపించకపోవటం ఏమిటి? మరి పురుడో?"

"అక్కడే అయితే బాగుంటుందని మా అత్తగా రంటున్నారు."

తెల్లబోయింది కాంతమ్మ — "ఇదేం చోద్యవే, .... పుట్టింటి వాళ్ళం వుండగా.... అక్కడే పురుడేమిటి? రేపు మీ అత్తగారు తన కూతుర్ని అలాగే వదిలేస్తుందా? మరి నువ్వే మన్నావూ?"

"ఏమో! నాకేం తెలుసూ? .... అసలా డాక్టరమ్మ తన ఆస్పత్రిలో పురుడు పోసుకోకపోతే వైద్యమే చెయ్యదట."

"మరీ మంచిది. దాని వైద్య మెవడిక్కావాలి? డాక్టర్లకేం కరువా?"

పద్మ మాట్లాళ్ళేదు.

తల్లి చెప్పుకొచ్చింది — "ఒక నెల్లాళ్ళ ముందే అత్తయ్యని పిలిపించి నీకా చెంబుడు నీళ్ళూ పోసేసి తల్లినీ పిల్లనీ లక్షణంగా ఏ మూడో నెల్లోనో పంపిద్దా మనుకుంటున్నాను. బాగుందమ్మా! మీ అత్తగారి కబురే బాగుంది" — ఆ రెండు మాటలూ అనేసింది గానీ — ఇంకా మనసులో బాధ తీరలేదు. వాళ్ళు ఎంత చెప్తే అంతేనా ఈ పిల్లకి? తల్లితో ఒకమాట చెప్పాలనీ, తల్లిని అడగాలనీ, వుండొద్దా?

పద్మ కొంచెం నవ్వు మొహంతో ఆరిందలాగ "అన్నాళ్ళూ నేను లేకుండా ఆయన వుండలేరట. అందుకే ఆయన అక్కడే వుండమంటున్నారు" అంది.

కాంతమ్మకే సిగ్గేసింది. లేచిపోయింది.

"అవునమ్మా మీ ఆయన వుండలేడు! మేం వుండగలం, నువ్వు ఎన్ని నెలలు లేకపోయినా!" అంది దూరం నించి

సాయంత్రం రామ్మూర్తి వచ్చాక, కాఫీ అదీ అయ్యాక, కడుపులో బాధ కాస్తా వెళ్ళగక్కేసింది — "చూశారా, పద్మే వంటోందో?" అని ప్రారంభించింది — "అసలు దానికి నెల తప్పిందన్న ముక్కే రాశారు కాదు. పోనీలే అని సరిపెట్టుకున్నాం. ఈ చోద్యం చూశారా? కోడలికి అత్తగారు అక్కడే పురుడు పోస్తుందట! అక్కడ డాక్టరమ్మ వుందటా, మందులవీ ఇస్తుందటా! అంత గొప్పగా మనం డాక్టర్లని పెట్టి చేయించగలమా?" అప్రయత్నంగా కాంతమ్మ కళ్ళలో నీళ్ళూరాయి.

రామ్మూర్తి మనసు విలవిల్లాడింది. నచ్చచెప్తో న్నట్టు చూశాడు — "ఛ! ఏమిటా దుఃఖం? పిచ్చిగానీ, అప్పుడే ఏమైపోయిందనీ? మనం కాదంటే వాళ్ళు మాత్రం చెయ్యొచ్చారా? పోనీ వాళ్ళకెలా బాగా వుంటే అలా చేసుకోనీ! ఇప్పుడు మనకేం లోటొచ్చింది?"

"లోటెందుక్కాదూ? గతిలేక పిల్లని పురిటికి తీసుకు రాలేదని నలుగురూ నవ్వరూ? అయినా వాళ్ళూ మనం సంప్రదించుకుని ఎక్కడ అయితే బాగుంటుందో ఒక మాటనుకోవద్దూ?"

"ఇంకా అప్పుడేనా? తర్వాత అడుగుతారేమో! రెండో నెల్లోనే అవన్నీ మాట్లాడుకుంటారా?"

"అవును కదా?" అన్నట్టు కాంతమ్మ నవ్వింది. కొంచెం తేలిక పడింది.

"సరేలే, ఏదో ఒకటవుతుంది. పద్మ వింటే మనసు కష్టపెట్టుకుంటుంది" అన్నాడు తండ్రి.

కాంతమ్మ కళ్ళు తుడుచుకుని లోపలి కెళ్ళబో తొంటే, రామూ వెక్కి వెక్కి ఏడుస్తూ వచ్చి తల్లిని కావలించుకుని బావురుమన్నాడు.

"ఏవిట్రా? ఏమైందిరా?" వీపు రాస్తూ అడిగింది తల్లి.

వాడు ఎక్కిళ్ళు ఆపి చెప్పేంతలోనే పద్మ రిస్ట్ వాచీ చేతిలో ఇటూ అటూ తిప్పుతూ వచ్చింది — "చూడమ్మా, ఈ వెధవేం చేశాడో! మొహం కడుక్కు వద్దామని వాచీ పెట్టిమీద పెట్టి వెళ్ళా. వచ్చేప్పటికి చేతికి కట్టుకుంటున్నాడు. నన్ను చూసి కంగారుపడి దబ్బున పడేశాడు. ఏమైందో ఏమిటో! అద్దం పగిలితే ఏమయ్యేది చెప్పు? వెధవని రెండు తగలనిచ్చాను" అంది వాచీ తనిఖీ చేస్తూ.

తల్లి మనస్సు ఉడికిపోయింది. అలాగే నించుని ఎగాదిగా చూసింది కూతుర్ని.

అక్క వచ్చినప్పట్నించీ చిన్నపిల్లలిద్దరూ ఆ వాచీ చూపించమని ఎన్నిసార్లు అడిగారో! "అక్కయ్యా! నాకోసారీ వాచీ కట్టవ్ .... ఒక్కసారి .... కింద పడె య్యను! ఒక్కసారి పెట్టుకుని తీసేస్తా" అని ఇద్దరూ బోల్డుసార్లు అడిగారు.

శకుంతల పోరు పడలేక ఒక్కసారి దానిచేతికి కట్టింది పద్మ.

అది మురిసిపోతూ ఇల్లంతా తిరిగింది. అందరికీ చూపించింది, వాచీ.

"చాల్లే! ఏ తలుపుకో తగిలించేస్తావ్! పాడౌ తుంది" అని అక్కగారు, చెల్లెలి చెయ్యిలాగి వాచీని వూడలాగేసి, తన చేతికి పెట్టేసుకుంది.

శకుంతలకి సరదా తీరకపోయినా, వాచీ తన చేతికివున్న మధుర క్షణాల్ని గుర్తుచేసుకుంటూ బయటి కెళ్ళిపోయింది. తర్వాత అదే చెప్పింది తమ్ముడితో — "ఇందాక అక్కయ్య నాకు వాచీ పెట్టింది. ఎంత బాగు న్నానో తెలుసా? అచ్చంగా అక్కయ్యలా వున్నాను" అంటూ వాణ్ణి తెగ వూరించింది.

రామం, పుట్టెడు ఉత్సాహంతో అక్క దగ్గిరికి పరి గెత్తాడు — "పెద్దక్కా! ఇందాక చిన్నక్కయ్యకి .... నీ

వాచీ .... పెట్టావు కదా? .... నాకూ ఒక్కసారి పెట్టవా?...." అన్నాడు గంతులేస్తూ.

"నీ చేతికి బెల్టు లూజై పోతుంది. వాచీ కింద పడి పోతుంది" అంది పద్మ.

తమ్ముడు వదల్లేదు — "ఏదీ? ఒక్కసారి చూస్తాను. మళ్ళీ నీకే ఇచ్చేస్తాను."

పద్మకి చిరాకేసింది — "చెప్తోంటే వినవేం? అది బద్దలు కొడితేగానీ నీ ప్రాణం ఊరుకోదా? వెధ వ్వేషం" అంది విసుక్కుంటూ.

రామం చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయాడు.

అదంతా తల్లికి తెలుసు. అప్పుడే వాణ్ణి ఓదార్చింది కూడానూ. అయినా వాడు ఉత్సాహం చంపుకోలేక వాచీ ముట్టుకుని రెండు దెబ్బలు తిన్నాడు. తల్లికి తల తీసేసి నట్టయింది.

పద్మ, పెళ్ళికి ముందు చిన్న వాళ్ళిద్దర్నీ ఎంత గారాబంగా చూసేదో, వాళ్ళ చదువు సంధ్యల గురించి ఎంత శ్రద్ధ చేసేదో, కాంతమ్మకి అంతా కళ్ళకు కట్టినట్టుంది.

వాళ్ళెప్పుడైనా చదవకపోయినా, పెంకితనాలు చేసినా రెండు దెబ్బలు కొట్టేది. అప్పుడు అమ్మకీ, అక్కకీ, తేడా లేదు. "పెద్దపిల్ల చిన్నపిల్లల్ని కొట్టిందే" అని తల్లికెప్పుడూ బాధ కలిగేది కాదు.

ఇప్పుడు పద్మ రామున్ని కొట్టిందంటే కాంతమ్మ మనసు గింజుకు పోయింది — "నీ వాచీ నువ్వు దాచు కోకపోయావా? వాడి ఒంటిమీద దెబ్బెందుకేశావు?" అని కూతురితో దెబ్బలాడాలనిపించింది.

"పోనీలే, వూరుకోమ్మా! నీ అక్కయ్యే కదా? అక్కయ్య కొడితేయేం? అయినా దాని వస్తువెందుకు ముట్టుకున్నావు? ఎంత ఖరీదు పెట్టికొనుక్కుందో ఏమిటో? అదిపోతే మనం తెప్పించి ఇవ్వగలమా ఏమ న్నానా?" అంటూ కొడుకునే మందలిస్తూ ఓదార్చింది.

వాడు తల్లి దగ్గిర మొహం పైకెత్తి బుగ్గ చూపిం చాడు. ఎడం బుగ్గమీద వేళ్ళతో గట్టిగా నలిపిన గుర్తులు రక్తం కూడుకుని పొంగి ఎర్రగా కనిపిం చాయి.

"ఒసే పద్మా! కొడితే వీపుమీద ఒక దెబ్బ కొట్టాలి గానీ ఏమిటే ఈ పనీ? వాడి బుగ్గ ఎంత కంది పోయిందో చూడు!" అంది కాంతమ్మ, కోపాన్ని అణుచుకుంటూ నిష్ఠూరంగా.

పద్మ మాట్లాడలేదు.

"ఇదొకటి నేర్చింది. దేనికీ నోరిప్పకపోడం! 'వీళ్ళతో నాకేం మాటలు!' అనుకుంటుందో ఏమిటో" అనుకుంటూ తల్లి గిజగిజ లాడింది.

★ ★ ★

పద్మకి మూడో ఉత్తరం వచ్చింది మొగుడి దగ్గి ర్నించి — వచ్చెయ్యమనీ, వాళ్ళమ్మ కూడా వచ్చెయ్య మని చెప్పమందనీ!

"అమ్మా! నేను రేపెళ్ళిపోతాను" అంది పద్మ అన్నం తింటూ.

తెల్లబోయింది కాంతమ్మ. "అదేమిటే? రేపే?"

"ఆయన ఉత్తరం రాశారు. మా అత్తగారు కూడా వచ్చెయ్యమన్నారట."

కాంతమ్మకి అరికాలి మంట నెత్తికెక్కింది.

"తల్లి మాటకి లెక్కలేదుగానీ, అత్తగారత్త గారంటూ అలా కొట్టుకు పోతున్నావేం?" అనెయ్య బోయి తమాయించుకుంది. పది రోజులన్నా పుట్టింట్లో వుండాలని అనిపించొద్దూ?

"సరే! నీ ఇష్టం. అలాగే వెళ్ళు" అనేసింది.

పద్మ అన్నంతిని లేచి, గబగబా పెట్టీ బేగూ సర్దేసు కుంది. మర్నాడు పొద్దుటి బండికి వెళ్ళిపోతానని ప్రయాణం స్థిరం చేసేసుకుంది.

"పోనీ రేపు సాయంత్రం వెళ్ళకూడదటే? ఏవైనా చేసి ఇస్తాను. సరుకులు ఇప్పటికిప్పుడెలా వస్తాయి? ఇంట్లో పంచదార లేదు. మైదాపిండి లేదు. అన్నీ తెచ్చుకోవాలి."

"ఎందుకూ? నాకేం వొద్దు. మా ఇంట్లో ఏవేవో చేస్తూనే వుంటారు."

మా ఇల్లు! మా ఇల్లు! అన్నిటికీ 'మా ఇల్లే'!

"బాగుందమ్మా మీ ఇంట్లో చెయ్యరనా నేననేది? పుట్టింటి నించి వెళ్తొన్న పిల్లవి .... కాస్త ఏదైనా తీసి కెళ్ళకపోతే ఏం బాగుంటుంది? పాకుండలు చెయ్యనా? ఈ పూటే చేస్తాను."

"ఒద్దు బాబూ! మా అత్తగారు నవ్వుతారు."

కాంతమ్మకి చెంపమీద కొట్టినట్టయింది. "నవ్వితే నవ్విందిలే. గొప్ప గొప్ప వంటలు నాకు చేతకావు.

చెప్పుల్లో కాళ్ళు పెట్టుక్కూర్చున్నావు. పోనీ, కొంచెం సెనగపిండి వుంది. కారప్పూస చెయ్యనా?"

"ఒద్దమ్మా! మా ఆయన తియ్యటివే కానీ .... కారం తినరు."

"అయితే బూందీ దూసి, బెల్లం మిఠాయి చేస్తాను."

"ఛీ! బెల్లం వొద్దు! పంచదార వెయ్యి."

కాంతమ్మ ఒక గంట పంచదార అప్పు కోసం తిరిగి ఎలాగో సంపాదించి తీసుకొచ్చింది. జానకిని సాయం పిలిచి మిఠాయి చేసి తాటాకుల బుట్టలో సర్దిపెట్టింది.

"గాజులూ .... రిబ్బన్నలూ అవీ ఏవన్నా కావాలటే పద్మా? సాయంత్రం జానకిని తీసుకుని వెళ్ళి కొనుక్కోరాదూ?"

"ఉహూ! నా దగ్గిర చాలా వున్నాయి. కావాలంటే అక్కడే కొనుక్కుంటాలే. డబ్బుంటే ఇయ్యి!" అంది పద్మ గదిలోంచి, పెట్టి మళ్ళీ సర్దుకుంటూ.

ఊరుకుంది కాంతమ్మ.

కిందటి రోజు శకుంతల బళ్ళోంచి రిబ్బన్నెక్కడో పారేసు కొచ్చింది. తల్లి తిడుతుందేమోనని జడుస్తూనే చెప్పింది. కాంతమ్మ కేకలెయ్యలేదు. దారం ముక్క కట్టింది జడకి.

పద్మ అంతా చూస్తూనే వుంది, పెట్లో అన్ని రిబ్బన్నులు పెట్టుకుని!

"అమ్మా! అక్కయ్య దగ్గిర గాజు పెట్టిలో బోలెడు రిబ్బన్లున్నాయే. ఒకటి అడగనా?" అంది ఆశగా శకుంతల.

"ఒద్దు. అది ఇవ్వాలిగానీ నువ్వలా అడక్కూడదు. సాయంత్రం నువ్వే కొనుక్కుందువు గానిలే. ఈ పూట కిలా వుండనీ!" అంటూ లేచింది కాంతమ్మ.

పద్మ వెళ్ళిపోతున్న కబురు సాయంత్రం తండ్రికి తెలిసింది. "అదేవిటి, అప్పుడే!" అన్నాడాశ్చర్యంగా. కూతుర్ని అడిగాడు — "అదేవిటమ్మా? అంత తొంద రేవిటి? పది రోజులన్నా అవందే?"

"ఉత్తరం వచ్చింది. రమ్మని రాశారు" అంది పద్మ నేల చూపులు చూస్తూ.

"అతనికి నేను జవాబు రాస్తాను. ఇంకో వారం రోజులుండ రాదమ్మా! నువ్వసలు వచ్చినట్టే లేదు. ఉన్నట్టే లేదు" అన్నాడు తండ్రి అభిమానం వుట్టిపడు తోంటే.

పద్మ మాట్లాడలేదు. కొంచెం నవ్వింది.

తల్లి అందుకుంది — "దాన్ని వెళ్ళనివ్వండి. దానింటికి అది వెళ్తుంది. ఎన్నాళ్ళుంటుంది పరాయి చోట?" అంది నిర్మోహమాటంగా.

రామ్మూర్తి ఇంకేమీ అనలేదు — "అయితే నీతో హరిని తీసికెళ్ళమ్మా! మళ్ళీ వొచ్చేస్తాడు" అన్నాడు.

"ఎందుకూ? అక్కర్లేదు. ఒక్కదాన్నీ వెళ్ళగలను."

"వెళ్ళలేవని కాదు, తోడెవరన్నా వుంటే బాగుం టుందమ్మా! నువ్వొచ్చేప్పుడు మీ ఆయన కూడా వస్తాడని వూరుకున్నాం గానీ లేకపోతే తీసుకు రావటానికి హరి వచ్చే వాడే."

"ఫర్వాలేదు నాన్నా! ఎందుకూ అనవసరంగా రానూ .... పోనూ...."

తమ్ముణ్ణి తనతో తీసుకెళ్ళడం అక్కగారికి సుతరామూ ఇష్టంలేనట్టుగా అనిపించింది.

తల్లి అందుకుంది — "అది వెళ్తాను మొర్రో అంటోంటే మీరేవిటి మధ్య? ఇప్పుడు దీన్ని దిగబెట్ట డానికి వాడికి మాత్రం ఖాళీ ఎక్కడుంది? వాడి చదువో?" అని కస్సుమంది. రామ్మూర్తి వూరుకున్నాడు.

మర్నాడు చీకట్నే ఇంట్లో వాళ్ళంతా లేచారు.

కూతురు మొహాన్న బొట్టుపెట్టి, చీరా రవికల గుడ్డా పెట్టింది తల్లి. ఆవిడ మనసు ఆ క్షణంలో అమృత భాండంలా ప్రేమతో నిండిపోయింది. "గండం గడిచి పండంటి బిడ్డనెత్తుకుని పది కాలాల పాటు సుఖంగా వుండు తల్లీ!" అనుకుంది కడుపులో.

పద్మ పర్సులోంచి చిల్లర డబ్బులు తీసి చిన్న వాళ్ళిద్దరికీ కొనుక్కోమని ఇవ్వబోయింది.

వాళ్ళిద్దరూ పుచ్చుకోలేదు.

"అక్కయ్య ఇస్తోంది. తీసుకోండర్రా!" అంది తల్లి.

ఇద్దరూ పుచ్చుకున్నారు.

పద్మ రిక్షా ఎక్కింది. హరి, రైలు ఎక్కించటానికి బైల్దేరాడు. సైకిల్ మీద అప్పటికి పొద్దు పొడుస్తోంది. వంట మొదలుపెట్టలేదు కాంతమ్మ. దిగులుగా భర్త దగ్గిర కూర్చుంది.

రామ్మూర్తి మాట్లాడకుండా పేపరు తెరిచాడు.

"ఎందుకలా ముభావంగా కూర్చున్నారు?" అంది కాంతమ్మ పలకరిస్తూ.

"ఆఁ, ఏం వుందీ? పద్మ తల్లి చాలా మారి పోయింది!"

"మారనివ్వండి. మనదేం పోయింది?" బరువుగా పలికింది కాంతమ్మ కంఠం.

ఆవిడ బాధ రామ్మూర్తి ఏనాడో గ్రహించాడు ఓదార్పుగా అన్నాడు — "పిచ్చిదానా! ఆడపిల్లలు మారిపోరా?"

"పిచ్చి నాకు కాదు, మీకే! ఆడపిల్లలే మారరు. వాళ్ళకీ తల్లీ తండ్రీ, అన్నా తమ్ముడూ అన్న అభిమానా లుంటాయి. ఎన్నేళ్ళొచ్చినా పుట్టింటికి రావటం అంటే మురిసిపోతారు. అత్తారింట్లో ఎంత అంతస్తుల మీద కెక్కినా పుట్టింట్లో పురిసెడు గంజి నీళ్ళయినా తాగాలనుకుంటారు. కానీ ఇది చూశారా, ఉన్న వారం రోజులూ ఎలా గింజుకు పోయిందో! పోనీ లెండి. అది మొగుడి దగ్గిరే పుట్టి పెరిగింది" కాంతమ్మ కంఠం రుద్ధమైపోయింది. కన్నీళ్ళు ఉబికి వచ్చాయి.

"చాల్లే! ఏవిటా చాదస్తం? అది చిన్నది. నువ్వు పెద్ద దానివి. అంత మాత్రం అర్థం చేసుకోకపోతే ఎలాగ? ఏదీ, దానికింకా కొత్త! వాళ్ళకేం కోపం వాస్తుం దోనని దాని భయం" అంటూ రామ్మూర్తి కొంచెం నవ్వాడు — "నువ్వు మాత్రం కొత్తలో మీ నాన్న తీసు కెళ్ళటానికొస్తే బిక్క మొహం వేశావు కదూ?" అన్నాడు.

"వెళ్ళటానికి కొంచెం కష్టం వేస్తే మాత్రం మా అమ్మనీ తోడబుట్టిన వాళ్ళనీ, మా ఇంటినీ చూసీ చూడ గానే అత్తిల్లంతా మర్చిపోయాను. అసలు నాకో మొగు డున్నాడన్న మాటే మర్చిపోయాను. పిల్లలు పుట్టే వరకూ నాకు పుట్టింటి ధ్యాస పోనేలేదు. పద్మ కదేవన్నా వుందా? మొగుడు ఎంత మురిపెంగా చూసుకుంటే మాత్రం, ఇరవయ్యేళ్ళపాటు కళ్ళల్లో పెట్టుకుని చూసు కున్న తల్లీ తండ్రీ కంటికి ఆనరా? తోడబుట్టిన వాళ్ళ మీద మమకారమే వుండదా? అంత మిడిసిపాటా! పుట్టింటి కొచ్చానన్న సంతోషం ఏమన్నా వుందా దానికి? ఇక్కడికొచ్చి పరాయి వాళ్ళింటి కొచ్చినట్టు మసిలింది. కన్నెత్తి చూసిందా, పన్నెత్తి పలకరించిందా? చిన్నపిల్లల్ని అసలు గిట్టనిచ్చిందా? వాళ్ళని పలకరిం చేదే కాదు. పెట్లో అన్ని రిబ్బన్లు పెట్టుకుని తోడబుట్టిన దానికి ఒక్కటి కూడా జారనివ్వలేదు. చిన్నపిల్ల జడకి దారం ముక్క కట్టుకుని తిరుగుతున్నా చూస్తూ వూరు కుంది. సరేలెండి, దానికిలేని ప్రేమ మనకు మాత్రం ఎందుకూ?"

"ఇప్పుడిలాగే అంటావు. పది రోజులు పోతే 'పద్మ ఎలా వుందో, ఏం చేస్తోందో' అని కలవరింతలు మొద లెడతావు."

కాంతమ్మకి కడుపులో వున్న కాఠిన్యం అంతా పైకి వచ్చింది — "దాని కోసం ఇక మనం కలవరించక్క ర్లేదు. దాని మొగుడున్నాడు. అత్తగారుంది. నౌకర్లు న్నారు, చాకర్లున్నారు. దానికేం లోటు? పది వేలకీ అలా వుండాల్సిందే. 'అమ్మ వుంది, నాన్న వున్నాడు, తోడబుట్టిన వాళ్ళున్నారు' అని దాని కెప్పటికైనా జ్ఞాపకం రావాలిగానీ దాని కబురు నా నోటితో అంటా నేమో చూడండి, కన్నాం.... పెంచాం .... పంపించాం. ఇంకా దానికీ మనకీ ఏం సంబంధం? మిగిలిన వాళ్ళని చూసుకోవాలి. మనల్ని నమ్ముకున్న వాళ్ళే మన బిడ్డలు."

"వాళ్ళు మాత్రం మారిపోరా? అడ్డాలనాడు బిడ్డలే గానీ .... గడ్డాలనాడు బిడ్డలా అంటారు కదా?" అని నవ్వాడు రామ్మూర్తి.

"పోనీ, అలాగే మారిపోనివ్వండి! అమ్మా నాన్నా అక్కర్లేని బిడ్డలు మనకు మాత్రం ఎందుకూ? మన మిద్దరమే వుందాం! మీకు నేనూ .... నాకు మీరూ .... అంతకన్నా ఏ భోగభాగ్యాలూ .... ఏ ముద్దు ముచ్చట్లూ అక్కర్లేదు మనకి. మనవేఁ ఉందాం. మారే వాళ్ళు మారతారు. పోయే వాళ్ళు పోతారు. అంతేగా?"

ఆ మాటలు అన్నాక కాంతమ్మ మనసు దూది పింజెలాగ తేలిక పడింది.

"అయ్యో! పిల్లలు బళ్ళోకి పోతారు. అన్నాలు పెట్టాలి. మరిచే పోయాను. శకుంతలా! ఎక్కడే? అన్నం పెడతానురా! తమ్ముళ్ళ పిలువు" అంటూ లేచి వెళ్ళిపోయింది కాంతమ్మ.

[1967 డిసెంబరు 'యువజ్యోతి' మాసపత్రికలో] ★